ప్రజాశక్తి

గురువారం 6 ఏప్రిల్ 2023

5

శ్రీ సత్యసాయి





బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్

'పురం'లో గాడి తప్పిన పాలన..!



హిందూపురం తహశీల్దార్ కార్యాలయం



హిందూపురం పురపాలక సంఘం కార్యాలయం

◆ రెండేళ్లుగా మున్సిపల్ కమిషనర్.... 9 నెలలుగా తహశీల్దార్ పోస్టులు ఖాళీ

◆ ఎఫ్‌ఎసిలతోనే కాలం వెళ్లదీత

◆ ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అతి పెద్ద పట్టణం, సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం హిందూపురం. పెద్ద పట్టణంతో పాటు 14 గ్రామ పంచాయితీలతో 16 రెవెన్యూ గ్రామలు, 35 మజరా గ్రామాలు, ఒక మేజర్ గ్రామ పంచాయితీలతో పాటు 38 వార్డులతో మండలం విస్తరించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1.51.677, రూరల్ మండల జనాభా 51.861 మొత్తం కలిపితే 2.03.538 మంది ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. గడిచిన 13 సంవత్సరాల్లో ఈ జనాభా దాదాపు ఒక లక్షకు పైగా పెరిగి ఉంటుందనేది అంచన. ఇంత పెద్ద మండలంలో రెవెన్యూ పాలన పూర్తిగా గాడి తప్పింది. రెండేళ్లుగా మున్సిపల్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. రెవెన్యూ కార్యలయంలో విధులు నిర్వహించే తహశీల్దార్ పోస్టు గత సంవత్సరం ఆగస్టు నుంచి ఖాళీగా ఉంది. దీంతో పాటు ఆర్‌ఐ, ఇతర పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. దీంతో రెవెన్యూ పాలన అస్తవ్యస్తంగా మారింది. సకాలంలో పనులు కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఒకప్పుడు హిందూపురం పురపాలక సంఘ కమిషనర్, మండల తహశీల్దార్‌గా రావాలంటే అందరూ పోటీలు పడే వారు. అయితే ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా, తహశీల్దార్‌గా రావాడానికి ఎవరూ అసక్తి కనబర్చడం లేదన్న వార్తలు వినపిస్తున్నాయి. ఇక్కడ రెగ్యులర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న భవానీప్రసాద్ 2020 జులై నెలలో బదిలీపై వెళ్లారు. దీంతో కదిరి పురపాలక సంఘ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న చెన్నుడును అదనపు కమిషనర్‌గా పురపాలక సంఘ అధికారులు నియమించారు. 2020 అక్టోబర్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటేశ్వరరావును అదనపు బాధ్యతల కింద నియమించారు. అప్పటి నుంచి కమిషనర్ పోస్టు ఖాళీగానే ఉంది. అదనపు బాధ్యలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరారవు గత వారం బదిలీపై వెళ్లారు. దీంతో అదనపు బాధ్యలు కింద ఇతర మున్సిపల్ కమిషనర్‌లకు అప్పగిస్తే ఎవరు ముందుకు రావాడానికి అసక్తి కనబర్చలేదు. దీంతో మున్సిల్ కార్యాలయంలో డిఈగా విధులు నిర్వహిస్తున్న నీరజకు అదనపు బాధ్యతలు కింద నియమించారు. ఈమె ఇప్పటికే ఎంఈ పోస్టు ఖాళీగా ఏర్పడినప్పటి నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నాని, ఇప్పుడు అదనంగా కమిషనర్ బాధ్యతలు నిర్వహించాడానికి తనకు సాధ్యం కాదాని అధికారులకు తెలిపినట్లు సమచారం. దీంతో సీనియర్ అధికారి అయిన ఎసిపి ఆనంద్‌కుమార్ కమిషనర్ అదనపు బాధ్యతలు తనకు వద్దని ఇప్పటికే చెప్పారు. కమిషనర్ భాద్యతలు చేపట్టడానికి ఎవరూ ముందుకు రాక పోవడంతో కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇంకా తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీనివాసులు గత సంవత్సరం ఆగస్టు నెలలో సాధరణ బదిలీల్లో భాగంగా వెళ్లారు. దీంతో చిలమత్తూరు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజును అదనపు భాధ్యత కింద (ఎఫ్‌ఎసి) హిందూపురం తహశీల్దార్‌గా గత సంవత్సరం ఆగస్టు 5న నియమించారు. ఇతన్ని అదనపు బాధ్యత కింద పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి నియమించారు. ఇక్కడ మళ్లీ ఫోస్టు ఖాళీగా ఏర్పడడంతో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న డి.ప్రసాద్‌ను జనవరి 14 నుంచి హిందూపురం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన ఒత్తిళ్లను తాళలేక వెళ్లిపోయారు. పరిగి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సౌజన్య లక్ష్మిని నియమించారు. ఈమె నెలన్నర పని చేసి తరువాత సాధ్యం కాదని చెప్పడంతో కొత్తచెరువు మండల తహశీల్దార్ రామాంజనరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న అమరేంద్రను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ సిసిగా డిప్యూటేషన్ చేశారు. దీంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడడంతో లేపాక్షి మండల ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ రెడ్డిని హిందూపురం ఆర్‌ఐ డిప్యూటేషన్ విధానంలో నియమించారు. దీంతో లేపాక్షి మండల ఆర్‌ఐ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. ఈయన్ను అమరావతికి కోర్టు విధుల నిమిత్తం బదిలీ చేసి, గుడిబండలో విధులు నిర్వహిస్తున్న బిలాల్‌ను ఆర్‌ఐగా నియమించారు. ఈయన ఇప్పటి వరకు ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మూడు నెలల కితం బాధ్యతలు స్వీకరించిన మైనూద్దీన్‌ను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్ చేశారు. దీంతో ఈ పోస్టు ఇప్పటికీ ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ అరతిని హిందూపురం మండలంతో పాటు మడకశిరా, లేపాక్షి మండలాలకు అదనపు భాధ్యత కింద ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇలా హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అధికారులను అదనపు బాధ్యత కింద ఇతర కార్యాలయాలకు ఇన్‌ఛార్జులుగా నియమించారు. ముఖ్య అధికారులైన కమిషనర్, తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పోస్టులు ఖాళీ ఏర్పడి సంవత్సరాలు గడిస్తున్నా ప్రభుత్వం నియమించక పోవడంతో వివిధ పనుల నిమిత్తం మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా హిందూపురం తహశీల్దార్ కార్యాలయానికి పట్టణం, రూరల్ మండలం వ్యాప్తంగా కుల, ఆదాయ, ఓబిసి, ఈబిసి ఇతర సర్టిఫికెట్ల కోసం సుమారు 3500 నుంచి 4వేల మంది ధరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో పాటు మ్యూటేషన్, పాసు పుస్తకాలు తదితర పనుల కోసం రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధరఖాస్తులు వస్తుంటాయి. ఇందులో ఎవరి పనులు కాక పోయిన రీయల్ ఎస్టేట్ వ్యాపారులు ధరఖాస్తు చేసుకున్న పనులు మాత్రం ఎఫ్‌ఎసిలుగా ఉన్నా వారే చకచకా పూర్తి చేస్తున్నారు. మిగిలిన వాటిని మాత్రం అలానే ఉంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్, రెవెన్యూ కార్యాలయానికి రెగ్యులర్ అధికారులను నియమించి, గాడితప్పిన పాలనను దారిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

డా॥బాబూ జగ్జీవన్ రామ్

జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి డా॥బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు.పుట్టపర్తి కలెక్టరేట్లోని స్పందన హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.బసంత్ కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, డిఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి బాబు జగ్జీవన్ రామ్ మహోన్నతమైన సేవ చేశారన్నారు. జగ్జీవన్ రామ్ పోరాటం, కషితోనే దళితుల హక్కుల కోసం రిజర్వేషన్లు ఏర్పాటయ్యాయని, దళితుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిడి శివ రంగ ప్రసాద్, ఆర్డీవో భాగ్యరేఖ, పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, పూడ ఛైర్మన్ లక్ష్మినరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో దారుణం

◆ భార్యను బండరాయితో మోది హత్య ◆ ఆపై భర్త ఆత్మహత్య

కుటుంబ కలహాలు, ఆపై అనుమానం ఓ కటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఏకంగా భార్యను హత్య చేసి, అపై భర్త కూడా ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ దారుణ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలోని ఎగువరామగిరిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భర్త వెంకటేశ్వర్లు(40), భార్య రాధమ్మ(35)ను రాళ్లతో కొట్టి హత్య చేసి, అనంతరం అతనూ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ



హత్యకు గురైన రాధమ్మ

వార్త మెయిన్‌లో..

ఇసుక తరలింపును అడ్డుకున్న టిడిపి కార్యకర్తలు

పలువురి అరెస్టు.. నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని పరిగి మండలంలో జెపి కాంట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తారని తెలుసుకున్న టిడిపి నాయకులు బుధవారం వెళ్లి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిడిపి కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలను పరామర్శించారు. అంతేగాకుండా స్థానిక సిఐ సురేష్‌బాబు, ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి విడుదల చేయాలని కోరారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఈరన్న కూడా స్టేషన్‌కు చేరుకుని టిడిపి నేతలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ పరిగి మండలంలోని జయమంగళి నదిలో ఇష్టానుసారం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి వైసిపి నాయకులు దోచుకుంటున్నారని విమర్శించారు. వారి ఆగడాలను అడ్డుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే టిడిపి కార్యకర్తలు, నాయకులను విడుదల చేసి ఇసుక అక్రమార్కులపై చర్యలు, తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఉగ్రనరసింహప్ప, రైతుసంఘం అధ్యక్షులు రాజగోపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రకాష్, క్రిష్టప్ప, శీనప్ప, అశ్వత్, పరిగి మండల నాయకులు కన్వీనర్ లక్ష్మీరెడ్డి, టిడిపి రాష్ట్ర వాల్మీకి సాధికార సభ్యుడు ఈశ్వరప్ప, జిల్లా రైతు అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక తరలింపును అడ్డుకుంటున్న టిడిపి శ్రేణులు

కదిరి ఆర్‌అండ్‌బి వసతి గృహానికి కరెంట్ కట్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న అన్న చందంగా కదిరి రోడ్లు, భవనాల అతిథి గృహం పరిస్థితి మారింది. దాదాపు 6లక్షలకు పైచిలుకు విద్యుత్ బకాయిలు ఉండటంతో వసతి గృహానికి కరెంట్ కట్ చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 10 రోజుల నుంచి విద్యుత్ లేకపోయినా ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీఐపీలు ఉండే వసతిగృహానికే కరెంటు లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై రోడ్డు భవనాల శాఖ డిఇ శైలజ స్పందిస్తూ పాత బకాయిలు దాదాపు రూ.7.5 లక్షలు చెల్లించకపోవడంతోనే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌అండ్‌బి అతిథి గృహానికి పెండింగ్ విద్యుత్ బిలులు చెల్లించి విద్యుత్ సరఫరాలను పునరుద్ధరించాలని కోరారు.



చీకట్లో ఉన్న కదిరి ఆర్‌అండ్‌బి అతిథిగృహం



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

జిల్లాలో అభివృద్ధి శూన్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నూతనంగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లాలో అభివృద్ధి శూన్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ విమర్శించారు. బుధవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తమవల్లే పుట్టపర్తి అభివృద్ధి జరిగిందని పాలకపక్షం, అభివృద్ధిలో ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రతిపక్షం విమర్శలు చేసుకోవడమే తప్ప ఎమరూ ఏమీ చేసిన పాపానపోలేదన్నారు. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత ఇప్పటికీ కార్యాలయాల్లో కుర్చీలు ఉండటం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఏ కార్యాలయంలో కూడా కనీస మౌలిక వసతులు లేవన్నారు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు, ఉద్యోగులు, అంగన్వాడీలు, రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేసేందుకు ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో వైసిపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పుట్టపర్తి నడిబొడ్డున చెప్పులతో దాడులు చేసుకుని పుట్టపర్తి ప్రతిష్టకు భంగం కలిగించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. వెంటనే పుట్టపర్తి ప్రతిష్టకు భంగం కలిగించిన అధికార, ప్రతిపక్ష నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసిపి ప్రతి పథకం ఓ మోసం..!



కూడేరు బహిరంగ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న నారా లోకేష్

◆ హంద్రీనీవా పనుల పూర్తిపై నిర్లక్ష్యం

◆ టిడిపి అధికారంలోకి రాగానే ఈ పనులను పూర్తి చేస్తాం

◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్


◆ ఉరవకొండలో ఘన స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టే ప్రతి పథకంలోనూ ఓ స్కాం ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారం నాడు ఉరవకొండ నియోజకవర్గంలో సాగింది. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర గొట్కూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం క్రాస్, కమ్మూరు క్రాస్‌కు మధ్యాహ్నంకు చేరుకుంది. అక్కడ భోజన విరామం తరువాత తిరిగి ప్రారంభమైన సాయంత్రానికి కూడేరుకు చేరుకుంది. అక్కడ రాత్రికి బస చేశారు. టిడిపి ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ ఉన్న ఉరవకొండ నియోజకవర్గంలో భారీ జన సమీకరణ కనిపించింది. పెద్దఎత్తున ప్రజలు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తూనే, స్థానిక సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా ప్రభుత్వ వైఫల్యాలు, సాగునీటి రంగంపై ప్రస్తావించారు. యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. మండలి ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన కాలి బెనికిందని, ఆయన అసహనంకు లోనై టేబుల్‌ను కాలితో తన్నడంతోనే బెనికిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే ప్రతి పథకంలోనూ ఒక స్కాం ఉంటుందన్నారు. అందుకే ఆయనున్న స్కాం మోహన్‌రెడ్డి అని తాను పిలుస్తానని చెప్పారు. చివరకు మద్యం అమ్మకాల్లోనూ అవినీతే ఉందని చెప్పారు. పంటకు పురుగుల మందులు కొడితే చనిపోవడం లేదుగాని, జగన్మోహన్‌రెడ్డి అమ్మే మద్యం మందు కొడితే చనిపోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, దళితులపైనా దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడి చేసిన వారిపై ఇంత వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. డ్రైవర్‌ను హత్య చేసిన కేసులో ఎమ్మెల్సీకి శిక్ష పడకపోగా, అతడికి ఘనస్వాగతం లభించిందని గుర్తు చేశారు. ఇక హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామని జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనలు మాటకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఉరవకొండ నియోజకవర్గంలో 80 వేల ఎకారలకు సాగునీరందిస్తామని హామీ ఏమైందని ప్రశ్నించారు. అదే విధంగా 50 వేల ఎకరాలకు సామూహిక బిందు,తుంపెర సేద్యం ద్వారా రూ.800 కోట్లతో టిడిపి హయాంలో చేపట్టిన ప్రాజెక్టు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు పిట్ట కొంచెం. అవినీతి ఘనం అన్న చందంగా ఉందని ఆరోపించారు. ఎడాపెడా భూములు కబ్జా చేసారని ఆరోపించారు. ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉరవకొండ ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ పోటీ చేస్తారని, ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి పాదయాత్ర

లోకేష్ చేపట్టిన పాదయాత్ర నేటికి 62వ రోజుకు చేరుకోనుంది. ఈ యాత్ర ఉదయం ఎనిమిది గంటలకు కూడేరులో బస చేసిన ప్రాంతం నుంచి ప్రారంభం అవుతుంది. అరవకూరు, కమ్మూరుకు మధ్యాహ్నం భోజన విరామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభమై శింగనమల నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది. గార్లదిన్నె మండలం కోటంకకు సాయంత్రం 4.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 7.30 గంటలకు మార్తాడు గ్రామానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.



గోరంట్లలో మహిళా సంఘాలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మహిళలకు చేయూతనివ్వడమే ప్రభుత్వ ధ్యేయం

'ఆసరా' వారోత్సవాల్లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గోరంట్ల

మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్‌రాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూడో విడత ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు మెగా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సిఎం జగన్ డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపిపి ప్రమీలామూర్తి, జడ్పిటిసి జయరాంనాయక్, ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, ఎపిఎం నారాయణ, తహశీల్దార్ రంగనాయకులు, సర్పంచులు ప్రభాకర్‌రావు, గంగప్ప, నర్సిరెడ్డి, సరోజ, నాగేనాయక్, సింగిల్‌విండో ఛైర్‌పర్సన్ శివశంకర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వైఎస్‌ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో కదిరి రూరల్ మండలాలకు సంబంధించి మహిళా సంఘాలకు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మెగాచెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలకు పెద్దపీట వేశారన్నారు. కదిరి రూరల్ మండలంలోని 5,865 మంది అక్క చెల్లెమ్మలకు రూ.5.29 కోట్ల మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పిటిసి రాధాబాయి, ఎంపిడిఒ సుధామణి, ఎపిఎం శారద, వైస్ ఎంపిపిలు, కోఆప్షన్ సభ్యులు, జెసిఎస్ కన్వీనర్, సర్పంచులు, వివిధ శాఖల ఛైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఆర్థికంగా, సామాజికంగా మహిళలు అత్యున్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మెగాచెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 9161 మంది లబ్ధిదారులకు మూడు విడతల్లో రూ.21.90 కోట్లు లబ్ది చేకూరినట్లు తెలిపారు. అలాగే సున్నా వడ్డీ కింద మూడు విడతల్లో 599.16 కోట్లు, చేయూత కింద రూ.5.73 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అనూష, ఎంపిటిసిలు జగన్‌మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి ఈడిగ తిరుమలేష్, సర్పంచి సంధ్య, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ కదిరి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు చేపట్టిన నిరసన బుధవారానికి 28వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతనెల 9వ తేదీ నుంచి ఎపి జెఏసి అమరావతి అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదర్‌రావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక డిపో వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సి.నబిరసూల్, సత్యసాయి జిల్లా కార్యదర్శి జివైపి.రావు, సిపిహెచ్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కాలసముద్రం దివాకర్, కార్యదర్శి పి.శంకరప్ప, డిపో కోశాధికారి కె.హరికుమార్, గ్యారేజీ కార్యదర్శి రవినాయక్, యూనియన్ నాయకులు జిసిఎస్.నాయుడు, కె.సుధీందర్, పిఇ.ఖాన్, కె.వి.రమణ, కె.హరి, ఎస్ఎస్.వలి, ఎస్వి.రత్నం, జమీర్, శివయ్య, అనిల్, టిజెపి నాయుడు, శోభారాణి, హృదయరాజు, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

8న రన్‌ఫర్ జీసస్

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.నాగేంద్రకుమార్

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండగలను పురస్కరించుకుని ఈనెల 8న చేపట్టనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చి కార్యదర్శి ఎ.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రైస్తవులు అత్యంత పవిత్రంగా ఆచరించే గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండగలను పురస్కరించుకుని యేసుక్రీస్తు శిలువ మరణం, పనరుత్తానాన్ని, వాటి ప్రశస్తతను సమస్త మానవాళికి తెలియజేస్తూ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హిందూపురం పాస్టర్ ఫెలోషిప్స్ ప్రెసిడెంట్లు రెవరెండ్ యన్.డేవిడ్, రెవరెండ్ యస్.సూర్యప్రకాష్, సిఅండ్ ఐజి మిషన్ కాంపౌండ్ చర్చి పాస్టర్ రెవరెండ్ స్టీఫన్ రాజ్, ట్రెజరర్ ఆదర్శ్ కుమార్, జాయింట్ సెక్రటరీ క్రిస్టఫర్, జాయింట్ ట్రెజరర్ యస్ హెచ్ ఆనంద్ రాజ్, డీకెన్ మెంబర్లు విక్టర్ జాషువా, జాన్సన్, జార్జ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'లో పాల్గొన్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడిమర్రి



జాతీయ నాయకులతో జిల్లా సిఐటియు నాయకులు

చలో ఢిల్లీ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ దేశంలో 44 చట్టాలపై తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్లులను వెంటనే రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఢిల్లీలో మహార్యాలీ, బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వాటర్ సప్లై జిల్లా అధ్యక్షులు తిప్పేస్వామి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాడిపత్రి ఉమాగౌడ్, తాడిమర్రి మండల సిఐటియు కార్యదర్శి నారాయణ, అనంత సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.


7న బాలయ్య రాక

హిందూపురం : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 7వ తేదీ శుక్రవారం హిందూపురానికి రానున్నట్లు పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం పట్టణంలోని ఆల్ హిలాల్ పాఠశాలలో ఆవరణలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మడకశిర : నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉంటున్న అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిడిపిఒ నాగమల్లేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ఏడు సహాయకురాళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

వైభవంగా మారెమ్మ జాతర



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్, ఛైర్‌పర్సన్, వైసిపి నాయకులు

హిందూపురం : పురపాలక సంఘం పరిధిలోని కొల్లకుంటలో వెలసిన మారెమ్మ అమ్మవారి జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



పుట్టపర్తిలో జగనన్నే మా భవిష్యత్ గోడ పత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తదితరులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈనెల 7 నుంచి 21వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ 99 శాతం ప్రభుత్వం అమలు చేసినట్లు తెలిపారు. ఈ విషయాలనే ఇంటింటికీ వెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, మాధవరెడ్డి, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పిలుపుమేరకు మండలంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి తాతం జగన్‌మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెసిఎస్‌జి రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కురమామిడి, వేపరాల, సోమయాజులపల్లి, మల్లమీదపల్లి సచివాలయ పరిధిలో ఉన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు మండలంలో జగనన్న భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, సర్పంచులు, గృహసారథులు పాల్గొన్నారు.



హిందూపురంలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్, తదితరులు

హిందూపురం : నియోజకవర్గవ్యాప్తంగా ఈనెల 7 నుంచి 14 రోజుల పాటు యజ్ఞంలా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, ముఖ్య నాయకులతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ఆయూబ్, వైసిపి నాయకులు పురుషోత్తంరెడ్డి, లతీఫ్ సేఠ్, మార్కెట్ చాంద్‌బాషా, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌పై సిఎం విమర్శలు సరికాదు

కేతిరెడ్డీ.. కాణిపాకం వెళ్లి నిజాయితీని నిరూపించుకో.. - జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



విలేఖరులతో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

తమ అధినేత పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేయనిదే సిఎం జగన్‌కు ముద్ద దిగదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచకాలు, దౌర్జన్యాలు, దందాలతో ప్రజలు విసుగుచెందారన్నారు. ప్రజలు ఆటుపోట్లను ఎదుర్కొని చివరికి సీఎంపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారన్నారు. ఇందుకు ఉదాహరణే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు అన్నారు. ప్రభుత్వం మద్యం అమ్మే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. అదేవిధంగా ఇసుకను కూడా ప్రభుత్వమే అమ్ముతోందన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి కొండలను చెరబడితే స్థానిక ఎమ్మెల్యే చెరువును కూడా చెరబట్టారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి అవినీతి, అక్రమాల గురించి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తే ఆయన సోషియల్ మీడియా ద్వారా అందరికీ సవాల్ విసురుతారన్నారు. నీవు అవినీతి, అక్రమాలు చేయలేదని కాణిపాకం వెళ్లి ప్రమాణం చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు.

ప్రమాద బాధితులకు తిప్పేస్వామి సాయం

108లో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి-మడకశిర



ఆటోను ఎత్తుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు

పట్టణ పరిధిలో మధుగిరి రోడ్డులో ఉన్న వెటర్నరీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సాయం చేశారు. పట్టణానికి చెందిన హమాలీలతో వస్తున్న ఆటో రాత్రి 8 గంటల సమయంలో బోల్తా పడింది. ఆసయంలో రొళ్లకు వెళ్తున్న తిప్పేస్వామి వాహనం దిగి క్షతగాత్రులను సాయం చేశారు. వెంటనే 108కు ఫోన్ చేసి వెంటనే క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఉమాశంకర్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, యువనేత వెంకటేష్, తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లను తొలగిస్తాం : ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర రూరల్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ యజమానులు వేసిన అక్రమ లేఔట్లను త్వరలోనే తొలగిస్తామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేసిన అక్రమ లేఔట్లలో ఎవరైనా స్థలాలు కొంటే చట్టవిరుద్ధమన్నారు. నిబంధనలు పాటించుకోకుండా విచ్చలవిడిగా 40కి పైగా లేఔట్లు వేశారన్నారు. త్వరలోనే పార్టీలకతీతంగా లేఔట్లను జెసిబిలతో తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కుమారుడు జయరాజు, కౌన్సిలర్ నాగేంద్ర, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ జిల్లా కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 6న గురువారం నుంచి ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని రసీదు పొందాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోసుల కోసం టెన్త్ ఉత్తీర్ణులై, వివాహిత, స్థానికంగా నివాసం ఉండే వారు అర్హులన్నారు. కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 19 మంది ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



ఉద్యోగాలకు ఎంపికైన శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు

పట్టణంలోని శ్రీనివాస డిగ్రీకళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట క్రిష్ణకిశోర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ముసల్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 70 మంది హాజరయ్యారు. వీరిని వికెఆర్ ఫార్మాకంపెనీ ప్రతినిధి కిరణ్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబాఫకృద్దీన్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 19 మందిదాకా ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన వారికి చెన్నై, బెంగుళూర్ ప్రాంతాల్లో ఏడాదికి 2.5 లక్షలు జీతం ఉంటుందన్నారు.

ఫ్రీజర్ ఏర్పాటుకు నగదు విరాళం

ప్రజాశక్తి-గోరంట్ల



విరాళం అందజేస్తున్న మొహమ్మద్

మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ మృతదేహాలను నిల్వ చేసేందుకు అవసరమైన ఫ్రీజర్‌కు రూ.1.15లక్షలను పంచాయతీ సెక్రటరీ సతీష్‌కుమార్‌కు బుధవారం విరాళం అందజేశారు. ఈ ఫ్రీజర్‌ను పంచాయతీ పరిధిలోని జామియా మసీదుకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పేద ముస్లిములు ఈ ఫ్రీజర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-తనకల్లు



ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తెలుగు యువత మండలాధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను బుధవారం స్థానిక మహిళా టైలరింగ్ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కేక్‌కోసి సంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుంచె నాగేంద్రప్రసాద్, బిసి నాయకుడు శంకర్‌నాయుడు, నారాయణస్వామి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, తాజ్ ఖాన్, పులి మహేష్, ఓబులేసు, వెంకటేష్, వార్డు మెంబర్ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

కదిరి బైపాస్ రోడ్డు నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి-కదిరి అర్బన్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

స్థానిక బైపాస్ రోడ్డు నిర్మాణంపై స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, తహశీల్దార్, కాంట్రాక్టర్‌తో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణ పనులపై ఆరాతీశారు. బైపాస్ రోడ్డు పరిధిలో ఇవ్వాల్సిన భూములను త్వరగా కాంట్రాక్టర్‌కు అప్పజెప్పాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సమానత్వమే జగ్జీవన్‌రామ్ కలలుగన్న స్వరాజ్యం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు ఆరేపల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

సమానత్వమే బాబూజీ కలలుగన్న స్వరాజ్యమని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరేపల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం మెడికల్ కళాశాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించి, అంటరానితనాన్ని నిర్మూలించడానికి, అస్పృశ్యతను పోగొట్టడానికి, సమాజంలో అందరూ సమానత్వంతో బతకడానికి బాబూజీ పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ శంకర్, సహాచార్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ శారద, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, సహాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర - జిల్లావ్యాప్తంగా నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర అన్నారు. బుధవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్ణిశలు కృషి చేసన ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన ఆశయాలను సాధించేందుకు కలిసి కట్టుగా ముందుకు సాగుదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు విక్టర్, వెంకటరాముడు, మహబూబ్ బాషా, చంద్రశేఖర్, నాగభూషణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగకుండా సమరం సాగించిన సామాజిక విప్లవయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నగారిన వర్గాలు, బహుజనులకు ఆత్మబంధువుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మూడ్ల గిరియప్ప, జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షుడు నరసింహప్ప, సుదర్శన్, నంజప్ప, దేవరాజు, రామాంజప్ప, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుబ్బారాయుడు, జిల్లా సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు జయకుమార్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామంజినమ్మ, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్, కౌన్సిలర్ సతీష్‌కుమార్, నాయకులు అమర్‌నాథ్, నెట్టప్ప, మోదా శివకుమార్, శ్రీనివాసరెడ్డి, మురళి, అజ్మతుల్లా, దాదాఖాన్, అంజాద్, ముక్తీయార్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారేస్, గిరిజన సంఘం ప్రసాద్‌నాయక్, చిన్నప్ప, చంద్రప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : జగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ సెల్ నాయకులు రామాంజనేయులు, చెనరాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఎస్సీ కాలనీలోనే ఆర్డీటీ పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసిన ఘనత జగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందన్నారు. అనంతరం అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తిరూరల్ : ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు ఎఆర్ డిఎస్‌పి విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటస్, ఆర్ఎస్ఐలు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు ప్రదీప్‌సింగ్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరిటౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, భారతరత్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశానుసారం పట్టణంలోని కందికుంట నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, టిడిపి పార్లమెంటు కార్యదర్శులు రెడ్డెప్ప, రామాంజినేయులు, కదిరి టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు విశ్వనాథ్, ఉపాధ్యక్షులు ఇవి.రమణ, ప్రధాన కార్యదర్శి బొగ్గిటి మునికుమార్, కదిరి రూరల్ నాయకులు లక్ష్మన్న, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ దేశంలోనే నాయకుల్లో ఒకరైన జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన సేవలను ఎప్పటికీ మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తగౌడ్, గరుగు వెంగప్ప, బోయ రవిచంద్ర, నాగూరుస్సేన్, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, పల్లపు రవీంద్ర, శ్రీనివాసులు, మాదన సుబ్బయ్య, మారుతీస్వామి, కేశగాళ్ల శీన, తొగట నారాయణస్వామి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షలు అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఉన్నత శిఖరాలను చేరుకున్నప్పుడే జగ్జీవన్‌రామ్‌కు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, బిల్లే రామాంజినేయులు, ఆదిరెడ్డి, అమర్‌నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, అమర్నాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, హరిశంకర్, తేజ, వేణుగోపాల్, శ్రీదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



హిందూపురంలో జగ్జీవన్‌రామ్ నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్



కొత్తచెరువులో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం